సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

మంగళవారం । 27 । ఆగస్టు । 2024



ప్రజా సమస్యలపై వినతుల స్వీకరణ
ప్రజా సమస్యలపై ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి సోమవారం వినతిపత్రాలను స్వీకరించారు. భాకరాపురంలో ఆయన ప్రజాదర్బార్ నిర్వహించారు. - 8లో



నెల్లూరు జట్టు విజయం
కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి స్టేడియంలో నిర్వహిస్తున్న ఏసీఏ అండర్-23 అంతర్ జిల్లాల మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్‌లో నెల్లూరు జట్టు విజయం సాధించింది. - 8లో

గరిష్ఠం/కనిష్ఠం
29.9 /21.6

వాతావరణం
జిల్లాలో సోమవారం 27.4 - 37.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 5.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్.



కోల్‌కతాలో వైద్యురాలిపై అత్యాచారం, హత్య సంఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో వైద్యులు, వైద్య సిబ్బంది భద్రత ..సౌకర్యాలపై 'సాక్షి' క్యాంపెయిన్.

వైద్యులకు భరోసా కల్పించాలి



వైద్యులు భయంతో వైద్యం చేసే పరిస్థితి ఉండకూడదు. కఠిన మైన చట్టాలతోనే ఇది సాధ్యం. వైద్యులపై చెయ్యి వెయ్యాలంటేనే భయం కలగాలి. మహిళా వైద్యులపై దాడికి మరింత కఠినమైన చర్యలు అవసరం. కోల్‌కతా లాంటి ఘటనలు పునరావృతం కా కుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి.- డాక్టర్ జీవీజీ మహేష్, ఐఎంఏ అధ్యక్షుడు, ప్రొద్దుటూరు.

చట్టం పక్కాగా అమలు చేయాలి



సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలు చేస్తే వైద్యరంగంలో మహిళా ఉద్యోగులకు మరింత భద్రత కలుగుతుంది. ఈచట్టం అమలుతో డ్యూటీలో ఉన్న వైద్య సిబ్బందిపై దాడులు జరిగితే ఫిర్యాదు అందిన ఆరుగంటల వ్యవ ధిలో నిందితులపై చర్యలు తీసుకో వాల్సి ఉంటుంది. ఈ చట్టంపై విస్తృత ప్రచారం కల్పించాలి. తద్వారా వైద్యరంగంలో మహిళలకు రక్షణ కలుగుతుంది.
- ఎస్. రిహానసుల్తాన, తాళ్లప్రొద్దుటూరు వైద్యురాలు

ప్రతి వైద్య విద్యార్థికి రక్షణ కల్పించాలి



వైద్య విద్యను అభ్యసిస్తున్న యూజీ, పీజీ వైద్య విద్యార్థులందరికీ రక్షణ కల్పించాలి. విద్యను అభ్యసిస్తున్న కళాశాలలో, వస తిగృహాలలో ప్రత్యేకంగా భద్రత కల్పించాలి. నేరాలకు జరిగేందుకు అవకాశమే కల్పించరాదు. అనుమానితులపై పోలీసుల నిఘా ఉండాలి.
- హర్షిత, పీజీ వైద్య విద్యార్థిని, ప్రభుత్వ సర్వజన వైద్యకళాశాల(రిమ్స్), కడప

వార్డు పక్కనే రెస్ట్ రూం ఉండాలి



నైట్ డ్యూటీలో ఉన్న మహిళా వైద్యులకు జన సంచారం లేని చోట కాకుండా వార్డు పక్కనే రెస్ట్ రూం ఉండాలి. మగ వాళ్ల కా కుండా మహిళా సెక్యూరిటీలను నియమించడం మంచిది. హాస్పిటల్ పూర్తిగా సీసీకెమెరాల నిఘా లో ఉండాలి. అప్పుడే మహిళా వైద్యులు ధైర్యంగా డ్యూటీ చేయగలరు.
- డాక్టర్ పద్మలత, గైనకాలజిస్టు, ప్రొద్దుటూరు

న్యూస్‌రీల్

రేపు మైలవరానికి నీటి విడుదల

జమ్మలమడుగు : గండికోట జలాశయం నుంచి మైలవరం జలాశయానికి అధికారులు నీటిని విడుదల చేయనున్నారు. ప్రస్తుతం గండికోట జలాశయంలో 16 టీఎంసీలకుపైగా నీరు నిల్వ ఉంది. ఇప్పటికే చిత్రావతి బ్యాలెన్సు రిజర్వాయర్,పైడిపాళెం ప్రాజెక్టులకు ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని మోటార్లద్వార పంపింగ్ చేస్తున్నారు. అదేవిధంగా ముద్దనూరు మండలం, కమలాపురంలో ఉన్న వామికొండ సర్వారాయ సాగర్ ప్రాజెక్టులకు గాలేరు-నగరి వరద కాలువల ద్వారా గండికోట వెనుక జలాలను విడుదల చేశారు. మరోరెండు రోజుల్లో గండికోట నుంచి మైలవరం జలాశయానికి నీటిని విడుదల చేసే అవకాశాలు ఉన్నట్లు మైలవరం ఇరిగేషన్ అధికారులు తెలిపారు. ఈ పాటికే నీటిని విడుదల చేయాల్సి ఉన్నా జలాశయంలో జాలర్లు చేపలను పట్టుకుంటుండటంతో కాస్త ఆలస్యమైందని మంగళవారం సాయంత్రం లేదా బుధవారం గండికోట ప్రాజెక్టు ద్వారా మైలవరం జలాశయంలోనికి నీరు విడుదల అవుతుందని ఏఈ గౌతం రెడ్డి పేర్కొన్నారు. ప్రస్తుతం మైలవరం జలాశయంలో 0.8 టీఎంసీల నీరు నిల్వ ఉందని తెలిపారు.

జిల్లాకు ఎరువుల రాక

కడప అగ్రికల్చర్ : ప్యారాదీప్ పాస్ఫేట్ లిమిటెడ్ కు సంబంధించిన 550 మెట్రిక్ టన్నుల యూరియా, మరో 700 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు సోమవారం కడపకు చేరాయని జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరావు తెలిపారు. ఇందులో 700 మెట్రిక్ టన్ను ల కాంప్లెక్ ఎరువుల్లో 450 మెట్రిక్ టన్నులు 10.26.26 కాంప్లెక్స్ ఎరువులు కాగా మరో 250 మెట్రిక్ టన్నులు 28.28.0 కాంప్లెక్స్ ఎరువులు ఉన్నాయని తెలిపారు. ఇందులో 105 మెట్రిక్ టన్నుల యూరియాను, మరో 100 టన్నుల కాంప్లెక్స్ ఎరువులను అన్నమయ్య జిల్లాకు కేటాయించినట్లు ఆయన తెలిపారు. మిగతా వాటిని జిల్లాలోని రైతు సేవా కేంద్రాలకు తరలించినట్లు వెల్లడించారు.

ఈ భారం.. ఇక ఆప్‌రా?

- టాయిలెట్స్ పర్యవేక్షణతో హెచ్ఎంలకు పెరగనున్న పనిభారం
- రోజు నాలుగు సార్లు పర్యవేక్షణ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు
- ప్రతి రోజు 13 కాలమ్స్ డేటా ఫాంను నింపి అప్‌లోడ్ చేయాల్సిన వైనం
- హెచ్ఎంలకు యాప్‌ల భారం తగ్గినట్లా? పెరిగినట్లా?



ఆయాతో మరుగుదొడ్డిని పరిశుభ్రం చేయిస్తున్న హెచ్ఎం



అప్పటి టీడీపీ ప్రభుత్వంలో పాఠశాలల్లో ఏర్పాటు చేసిన యూరినల్స్(ఫైల్)



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన యూరినల్స్

కడప ఎడ్యుకేషన్: కూటమి ప్రభుత్వం మరోసారి మాట మార్చింది. ఉపాధ్యాయులకు, హెచ్ఎంలకు బోధనకే పరిమితం చేస్తామని.. ఇతర పనిభారం ఏమీ ఉండదని ఎన్నికల ప్రచారంలో పదే పదే చెప్పింది. ముఖ్యంగా టాయిలెట్స్ పర్యవేక్షణ నుంచి పూర్తిగా మినహాయిస్తామని బల్ల గుద్ది మరీ చెప్పింది. అధికారంలోకి వచ్చి మూడు నెలలైనా కాకముందే హామీని ముక్కలు చేసింది. ప్రధానోపాధ్యాయులపై యాప్‌ల భారం మరింత పెంచే ప్రయత్నం చేస్తోంది.

గత ప్రభుత్వంలో..

గతంలో ప్రధానోపాధ్యాయులు పాఠశాలకు వచ్చిన తర్వాత ఆయాలు మరుగుదొడ్లను శుభ్రం చేస్తే అవి ఎలా ఉన్నాయో చూసి పారిశుద్ధ్యం ..గుడ్ లేక బ్యాడ అని పరిశీలించి ఫొటో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేస్తే పని అయిపోయేది. కానీ నేడా పరిస్థితికి భిన్నంగా ఉందని ప్రధానోపాధ్యాయులు వాపోతున్నారు. హెచ్ఎం ప్రతి రోజు నాలుగుసార్లు మరుగుదొడ్లను పరిశీలించి అవి పరిశుభ్రంగా ఉన్నాయా లేదా అని చూడాలి. సాయంత్రం 3 నుంచి 3.30 గంటల మధ్యలో ప్రభుత్వం ఇచ్చిన 13 కాలమ్ డేటా ఫాంను నింపి అందులో ఒక కాలంలో రిమార్క్ గురించి వివరించి అప్‌లోడ్ చేయాల్సి ఉంది. ఇలాగైతే ప్రధానోపాధ్యాయుల పనిభారం తగ్గినట్లా? లేక పెరిగినట్లా? అని హెచ్ఎంలు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు.

వారంలో రెండు సార్లు..

ప్రధానోపాధ్యాయులు గతంలో మరుగుదొడ్ల ఫొటోలు తీసి.. బాగాలేకుంటే ఆయాలకు సూచనలు, సలహాలను ఇచ్చేవారు. నేడు ఫొటోలను తీసే పనిని సచివాలయ ఎడ్యుకేషన్ సెక్రటరీ, ఎస్ఎంసీ చైర్మెన్ చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. అది కూడా వారంలో బుధ, శుక్రవారాల్లో ఎస్ఎంసీ చైర్మెన్, వైస్ చైర్మెన్.. మంగ్ల, గురువారాల్లో ఎడ్యుకేషన్ సెక్రటరీలు మరుగుదొడ్ల ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయాలని సూచించింది. ఇది జరిగే పనేనా అనే విమర్శలు వస్తున్నాయి. ఒక సచివాలయ పరిధిలో ఉన్న ఒక ఎడ్యుకేషన్ సెక్రటరీ ఆ రెండు రోజుల్లో ఎన్ని పాఠశాలలు ఉంటే అన్ని పాఠశాలలకు వెళ్లి ఫొటోలు అప్‌లోడ్ చేయగలుగుతారా అంటూ పలువురు విమర్శిస్తున్నారు.

ఎస్ఎంసీలకు ఈ పనా..

రెండు సార్లు పాఠశాలకు వచ్చి మరుగుదొడ్లు పరిశీలించి ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయమనడం ఎంత వరకు సమంజసమని పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్, వైస్ చైర్మెన్‌లు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా వారు ఎస్ఎంసీ సమావేశాల సమయంలో పాఠశాలను సందర్శించి పలు అభివృద్ధి పనులను పరిశీలన చేయడం, మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అమలు చేస్తున్నారా లేదా అని పర్యవేక్షించాల్సి ఉంటుంది. అంతేగానీ వ్యక్తి గత పనులు వదులుకుని వారంలో రెండు సార్లు పాఠశాలకు వచ్చి ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయగలరా .. ఇవన్నీ ఆయ్యే పనులేనా అంటూ పలువురు పెదవి విరుస్తున్నారు. ఎస్ఎంసీ చైర్మన్‌లలో చదువుకోని వారు ఉంటారు మరి వారి పరిస్థితేంటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

కొరవడనున్న బోధన పర్యవేక్షణ

హెచ్ఎంలు రోజులో నాలుగుసార్లు మరుగుదొడ్లను పర్యవేక్షించి కాలమ్‌ను నింపడం.. యాప్‌లో అప్‌లోడ్ చేయడానికి సమయం సరిపోతుంది. ఇక ఉపాధ్యాయులు, విద్యార్థుల పర్యవేక్షణ ఎప్పుడు చూసుకోవాలో ప్రభుత్వ పెద్దలకే తెలియాలి మరి.

ఫొటోలు తీయకుంటే చర్యలుంటాయా..



పాఠశాలలోని మరుగుదొడ్ల ఫొటోలు తీయకుంటే ఎడ్యుకేషన్ సెక్రటరీ, ఎస్ఎంసీ చైర్మెన్‌లపై చర్యలు తీసుకునే నిబంధనలు ఉన్నాయా... లేవా.. అంటూ విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. అటు ఎడ్యుకేషన్ సెక్రటరీ, ఇటు హెచ్ఎంల మధ్య పర్యవేక్షణ కొరబడి చివరకు మరుగుదొడ్ల పర్యవేక్షణ గాలిలో దీపంలా తయారయ్యే పరిస్థితికి చేరుకుంటుందని పలువురు మేధావులు, విద్యావేత్తలు అంటున్నారు.

యాప్‌ల బాధ నుంచి విముక్తి కలిగించాలి



టీచర్లకు బోధనేతర పనులు అప్పగించకుండా బోధనకు మాత్రమే పరిమితం చేయాలని మేము డిమాండ్ చేస్తుంటే ప్రభుత్వమేమో రోజురోజుకు యాప్‌ల భారాన్ని పెంచుతూనే ఉంది. ఎస్ఎంసీ కమిటీ సభ్యులతో ఫొటోలను తీయించే బాధ్యత హెచ్ఎంల మీద ఉండటం సరికాదు.
- ఆదిరెడ్డి శ్యాంసుందర్‌రెడ్డి, ఏపీటీఎఫ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు.

బోధనకు భంగం కలిగించడమే



ప్రభుత్వం ప్రవేశ పెట్టే యాప్‌ల వల్ల బోధనకు భంగం కలుగుతుంది. మరుగుదొడ్ల పర్యవేక్షణకు సంబంధించి హెచ్ఎంలకు ఫొటోతీసే పని తప్పించి ప్రతి రోజు సర్వే ఫార్మెట్ ఫిల్ చేయాలని చెప్పడం సరికాదు. ఆన్‌లైన్ పనిభారం తగ్గించడానికి ప్రతి పాఠశాలకు ఒక డిజిటల్ అసిస్టెంట్‌ను కేటాయించాలి.
- ఎస్. నజీబుల్లా, ఎస్టీయూ జిల్లా కార్యదర్శి

హామీ నెరవేర్చాలి..



ఉపాధ్యాయులకు యాప్‌ల భారం లేకుండా చేస్తామని చెప్పి ఓటు వేయించుకుని అధికారిలోకి వచ్చాక ఒక యాప్‌ను తొలగించామని కూటమి ప్రభుత్వం చెబుతోంది. తీరా చూస్తే ఆ ఒక్కటి కూడా తొలగించకుండా తొలగించినట్లు ఉపాధ్యాయులను మభ్యపెడుతోంది. కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడినట్లుగా ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం ఉపాధ్యాయులకు యాప్‌ల బాధ తొలగించాలి. - లెక్కల జమాల్‌రెడ్డి, పీఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షులు.

దూసుకొచ్చిన మృత్యువు!

చుట్టూ చీకటి.. ఏమైందో తెలీదు..ఏం జరుగుతోందో అర్థం కాలేదు.. కళ్లు తెరిచి చూసేలోపే ఘోరం జరిగిపోయింది. మృత్యువు రాకాసిలా దూసుకొచ్చి 'పంచ' ప్రాణాలను గాల్లో కలిపేసింది. ఓ కుటుంబంలో భర్తను మృత్యు ఒడికి చేర్చి.. భార్యా పిల్లలను రోడ్డు పాలు చేసింది. మరో కుటుంబంలో భార్యను మృత్యు కౌగిట్లోకి పంపి భర్త..పిల్లలను శోక సంద్రంలో ముంచెత్తింది. ఒకటా రెండా.. ఏకంగా ఐదు కుటుంబాల్లో నిండు చీకట్లు నింపి.. వెలుగు దూరం చేసింది. కడప నగర శివార్లలోని 'గువ్వల చెరువు' మరోసారి రక్తమోడింది. బాధితుల ఆర్తనాదాలు చీకటి మింగేయగా... ప్రమాదాలు జరగని రోజు ఎప్పుడొస్తుందంటూ 'ఘాటు' మౌనంగా చూస్తూ ఉండిపోయింది. అలాగే దువ్వూరు మండలం బయనపల్లె జాతీయరహదారిపై జరిగిన మరో రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబంలో ముగ్గురు మృతి చెందారు.



వెంకటమ్మ (ఫైల్)



షరీఫ్ (ఫైల్)



నాగలక్ష్మి (ఫైల్)



నాగయ్య (ఫైల్)



- గువ్వలచెరువు ఘాట్ రోడ్డులో ఐదుగురు
- దువ్వూరు మండలం బయనపల్లి వద్ద ముగ్గురు మృతి
- శోకసంద్రంలో కుటుంబ సభ్యులు

చక్రాయపేట/కడప అర్బన్/రామాపురం : గువ్వల చెరువు ఘాట్ రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదం చక్రాయపేట మండలంలో తీరని విషాదాన్ని నింపింది. చక్రాయపేట మండలం కుప్పం గ్రామం కె.వడ్డెపల్లెకు చెందిన ముగ్గురు, చక్రాయపేటకు చెందిన కారు డ్రైవరు మృతి చెందారు. వడ్డెపల్లెకు చెందిన సత్యనారాయణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. సోమవారం ఆయన పెద్ద ఖర్మను ఇంట్లో నిర్వహించారు. అనంతరం మృతుడి భార్య చిన్న వెంకటమ్మ బంధువుల ఇళ్లలో దీపం చూడటానికి వెళుతుండగా ప్రమాదం జరిగింది. ఈప్రమాదంలో వల్లెపు చిన్నవెంకటమ్మ(45)తో పాటు తోడుగా వెళ్లిన ఆమె సోదరుడు గుజ్జుగారి నాగయ్య (40), కోడలు వరుసకు చెందిన వల్లెపు నాగలక్ష్మిదేవి (35)లతో పాటు కారు బాడుగకు వెళ్లిన చక్రాయపేటకు చెందిన మహబూబ్ షరీఫ్ (40), కంటైనర్ డ్రైవర్‌లు ప్రాణాలు కోల్పోయారు. మృతదేహాలను రాయచోటి ఆస్పత్రికి తరలించినట్లు లక్కిరెడ్డిపల్లె సీఐ కొండారెడ్డి తెలిపారు.



సంఘటనా స్థలం వద్ద రోదిస్తున్న మృతుల బంధువులు

వడ్డె పల్లె..తల్లడిల్లె..

వడ్డె పల్లెకు చెందిన మృతులు ముగ్గురూ బంధువులే కావడంతో ఆ ఊర్లోనూ విషాదం నెలకొంది. మృతుడు నాగయ్యకు భార్య అంజనమ్మతో పాటు 17 ఏళ్లలోపు ఉన్న ముగ్గురు బిడ్డలు ఉన్నారు. వల్లెపు నాగలక్ష్మీ దేవికి భర్త ఆంజనేయులుతో పాటు 12 ఏళ్లలోపు ముగ్గురు బిడ్డలు ఉన్నారు.

సంఘటన స్థలానికి పరుగులు

ప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న వెంటనే కె.వడ్డెపల్లె,చక్రాయపేట వాసులు అద్దె వాహనాల్లో గువ్వల చెరువుకు వెళ్లారు. అక్కడి నుంచి మృత దేహాలు ఉన్న రిమ్స్‌కు వెళ్లారు.

నాల్గో మలుపు వద్ద ప్రమాదం..

కర్నూలు - చిత్తూరు జాతీయ రహదారిలోని రామాపురం మండల గువ్వలచెరువు ఘాట్‌రోడ్డులోని నాల్గోవ మలుపు వద్ద ఈ రోడ్డు ప్రమాదం జరిగింది. కడప నుంచి కారు గువ్వలచెరువు ఘాట్‌రోడ్డు నాల్గో మలుపు వద్దకు రాగానే రాయచోటి వైపు నుంచి కడప వైపు వెళ్తున్న అమరరాజా బ్యాటరీకి చెందిన లారీ ఢీ కొనడంతో లారీ డ్రైవర్‌తో సహా ఐదుగురు మృతి చెందారు. ఈ సంఘటన కేవలం కంటైనర్ డ్రైవర్ నిర్లక్ష్యం వల్లనే సంభవించిందని పోలీసులు నిర్ధారణకు వచ్చారు. వైఎస్సార్ జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, లక్కిరెడ్డిపల్లె సీఐ కొండారెడ్డి, రామాపురం ఎస్ఐ వెంకటసుధాకర్‌రెడ్డి, సీకే దిన్నె ఎస్ఐ, సీఐ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కుటుంబ పోషణ కోసం కారు పెట్టుకొని..

చక్రాయపేటకు చెందిన మహబూబ్ షరీఫ్ తన కారును బాడుగలకు తిప్పుతూ వచ్చిన ఆదాయంతో భార్యా బిడ్డలను పోషించు కొంటున్నాడు. ఇందులో భాగంగానే సోమవారం కారుకు బాడుగ మాట్లాడుకొని భార్యకు జాగ్రత్తలు చెప్పి ఇంటి నుంచి బయలు దేరాడు. బాడుగ మాట్లాడుకున్న ప్రకారం.. వడ్డెపల్లె నుంచి వేంపల్లె, అయ్యవారుపల్లె, మైదుకూరు, మిట్టమీదపల్లె, కడపలో ఉన్న బంధువుల ఇళ్లవద్దకు వెళ్లారు. కడప నుంచి గువ్వల చెరువుకు వెళుతుండగా లారీ రూపంలో మృత్యువు కబళించింది. భర్త మహబూబ్ షరీఫ్ మృతి వార్త తెలుసుకున్న భార్య షాహిన్ కన్నీటి పర్యంతమైంది. షరీఫ్‌కు ఐదుగురు సంతానం కాగా.. ఇద్దరు మొదటి భార్య బిడ్డలు. ఆమె చనిపోవడంతో రెండవ వివాహం చేసుకున్నాడు. వీరిద్దరికి ముగ్గురు సంతానం. పిల్లలందరూ పదేళ్లలోపే కావడంతో తమ గతి ఏంటంటూ షాహీన్ కన్నీటి పర్యంతం అవుతోంది.



చిన్న బిడ్డలను పట్టుకొని కన్నీటి రోదనతో ఉన్న షరీఫ్ సతీమణి షాహీన్

పుట్టు వెంట్రుకలకు వెళుతుండగా..

- కారు అదుపు తప్పి బోల్తా..
- ముగ్గురు దుర్మరణం
- దువ్వూరు మండలం చింతకుంట వద్ద ఘటన



మృతి చెందిన చిన్నారి కియన్‌సింగ్, చిన్నారి తండ్రి భగత్‌సింగ్, వృద్ధురాలు నాగలక్ష్మి

ప్రొద్దుటూరు క్రైం/ దువ్వూరు : కుమార్తె పుట్ట వెంట్రుకల కార్యక్రమాన్ని తిరుమల వెంకటేశ్వర స్వామి సన్నిధిలో నిర్వహించాలని తల్లిదండ్రులు మొక్కుకున్నారు. ముఖ్యమైన బంధువులతో కలిసి సంతోషంగా రెండు కార్లలో బయలుదేరారు. అయితే మార్గం మధ్యలో జరిగిన రోడ్డు ప్రమాదం చిన్నారితో సహా మరో ఇద్దరిని బలి తీసుకుంది. మొక్కు తీర్చుకునే అవకాశం ఇవ్వకుండానే చిన్నారిని దేవుడు తిరిగి రాని లోకాలకు తీసుకెళ్లాడు. దువ్వూరు మండలంలోని చింతకుంట గ్రామం వద్ద కారు అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో కర్నూలుకు చెందిన కియాన్‌సింగ్ (9 నెలలు), భగత్‌సింగ్ (34), నాగలక్ష్మి (70) దుర్మరణం చెందారు.

ఫోన్ చేసేంత వరకు వారికి తెలియదు..

చెర్లోవెట్ 7 సీటర్ కారు, తుఫాన్ వాహనాల్లో వారు తిరుమలకు పయనమయ్యారు. ముందుగా తుఫాన్ వాహనం వెళ్తుండగా కొంత దూరంలో వారి వెనకాలే చెర్లోవెట్ కారును భగత్ సింగ్ డ్రైవింగ్ చేసుకుంటూ వెళ్తున్నాడు. అయితే కారు బోల్తా పడిన విషయం ముందుగా తుఫాన్‌లో వెళ్తున్న వారికి తెలియదు. ప్రమాదానికి గురైన వారు తేరుకొని కొంత సేపటి తర్వాత ఈ విషయాన్ని వారికి తెలిపారు. అప్పటికే చాలా దూరం వెళ్లిన బంధువులు తుఫాన్ వాహనాన్ని వెనక్కి తిప్పుకొని వచ్చారు. స్థానికుల సాయంతో గాయ పడిన వారిని 108 వాహనాల్లో ఆస్పత్రులకు తరలించారు.



ఆస్పత్రి వద్ద రోదిస్తున్న బంధువులు

ఐదు నిమషాల ముందు చిన్నారి తండ్రి వద్దకు వెళ్లింది

చిన్నారి కియాన్‌సింగ్ తన బాబాయి వద్ద మధ్య సీట్లో కూర్చుంది. తండ్రి వద్దకు వెళ్తానని ఏడ్వడంతో కియాన్‌సింగ్‌ను డ్రైవింగ్ చేస్తున్న తండ్రి భగత్‌సింగ్ వద్దకు పంపించారు. డ్రైవింగ్ చేస్తున్న భగత్‌సింగ్ పాపను తన ఒళ్లోనే కూర్చోపెట్టుకున్నాడు. ఐదు నిమిషాల తర్వాత కారు ప్రమాదానికి గురైంది. తండ్రి వద్దకు పాప వెళ్లకుండా ఉండి ఉంటే బతికేదని చెప్పుకుంటూ బంధువులు విలపించసాగారు. కాగా జిల్లా ఆస్పత్రిలో బంధువులు రోధనలు చూసేవారికి కంటతడి తెప్పిస్తున్నాయి. దువ్వూరు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతి ఒక్కరి రక్షణపై భరోసా కల్పించాలి



వైద్యులు, విద్యార్థులకు తమ పనులకు ఎలాంటి ఆటంకం లేకుండా ప్రత్యేకంగా సెక్యూరిటీ సిబ్బందితో రక్షణ కల్పిస్తున్నామనే భరోసా కల్పించాలి. పోలీసులు, న్యాయ వ్యవస్థ నేరాలపై త్వరగా దర్యాప్తు చేసి వెంటనే చట్టపరంగా చర్యలు తీసుకోవాలి.

- డాక్టర్ నాగరాజు, జనరల్ సర్జరీ విభాగం, రిమ్స్, కడప

ప్రతి మహిళా ఉద్యోగి అప్రమత్తంగా విధులను నిర్వహించాలి



ఆసుపత్రులు, ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులు అప్రమత్తంగా వ్యవహరించాలి. ఒంటరిగా ప్రయాణాలను చేసేటప్పుడు కచ్చితంగా తమకు అందుబాటులో సెల్‌ఫోన్‌ను ఉంచుకోవాలి. పోలీసు సహాయం కోసం డయల్ 100కు కాల్ చేసి సహాయం పొందవచ్చు

- ఆర్. లక్ష్మీకళ, ఎఫ్.ఎన్.ఓ, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్),కడప



ఉద్యోగుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



ఉద్యోగుల భద్రతపై ప్రత్యేకంగా శ్రద్ధ వహించాలి. వైద్యశాలలు, కళాశాలల్లో విద్యార్థులు, అధ్యాపకులపై జరిగే దాడులను నివారించాలి. ఏవైనా సంఘటనలు జరిగినప్పుడు అందరూ అండగా నిలవాలి.

- రవికుమార్, మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ నాయకుడు, రిమ్స్, కడప

నేరాలపై త్వరగా చర్యలు తీసుకోవాలి



ఏవైనా నేరాలు జరిగినప్పుడు త్వరగా పోలీసులు స్పందించి చర్యలను తీసుకోవాలి. సంఘటనలు జరగకుండా నియంత్రణ చర్యలు చేపట్టాలి. చిరుద్యోగి స్థాయి నుంచి ఉన్నత ఉద్యోగి స్థాయి వరకు ప్రతి ఒక్కరూ ఉద్యోగ భద్రత, వ్యక్తిగత భద్రతను కలిగి ఉండాలి.

- గాయత్రి, సీనియర్ అసిస్టెంట్, ప్రభుత్వ వైద్యకళాశాల, రిమ్స్, కడప

క్లుప్తంగా

మూడు ఇసుక ట్రాక్టర్లు సీజ్



ఇసుక అక్రమ రవాణా ట్రాక్టర్లను సీజ్ చేసిన పోలీసులు

వేంపల్లె: స్థానిక పాపాఘ్ని నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు వేంపల్లె సీఐ సురేష్‌రెడ్డి తెలిపారు. పోలీసులకు అందిన సమాచారం మేరకు ఆదివారం అర్ధరాత్రి తమ సిబ్బందితో కలిసి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న వారిపై దాడులు చేశారు. ఈ క్రమంలో పాపాఘ్ని నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకుని స్టేషన్‌కు తరలించినట్లు వెల్లడించారు. వారిపై కేసులు నమోదు చేసి, పులివెందుల ఎస్ఈబీఅధికారులకు అప్పగించామన్నారు. సీఐ మాట్లాడుతూ ఎవరైనా ఇసుకను అక్రమంగా తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు



అనాథ మృతదేహాన్ని అంత్యక్రియలకు తరలిస్తున్న మేము సైతం సంస్థ ప్రతినిధులు

కడప అర్బన్ : రిమ్స్ మార్చురీలో ఉన్న అనాథ మృతదేహానికి సోమవారం మేము సైతం స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు హిందూ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు. కడప రైల్వేస్టేషన్ పట్టాలపై ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని ఆచూకీ కోసం కడప రైల్వే పోలీసులు విచారించగా ఆచూకీ లభించలేదు. మృతదేహం కోసం ఎవరూ రాకపోవడంతో అనాథగా భావించి అంత్యక్రియలు నిర్వహించాలని మేము సైతం ప్రతినిధి అయ్యవారయ్యను రైల్వే పోలీసులు కోరారు. ఈ మేరకు అంత్యక్రియలు నిర్వహించామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో అయ్యవారయ్య, గురువయ్య, శివరాం, రామలోకం, కిషోర్, రామరాజు, నాగేశ్వరరావు, పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరాలపై దాడులు

పులివెందుల రూరల్ : పట్టణంలోని నగరిగుట్ట, కదిరిరోడ్డులో పేకాట స్థావరాలపై సోమవారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ నారాయణ మాట్లాడుతూ సీఐ ఆదేశాల మేరకు పట్టణంలోని రెండు ప్రాంతాల్లో పేకాట స్థావరాలపై దాడులు చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకుని నగరిగుట్టలో రూ.23,180లు, కదిరిరోడ్డులో రూ.12,730లు నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

స్వీయ అంచనా పరీక్షలకు సన్నద్ధం

- నేటి నుంచి అన్ని ప్రభుత్వ యాజమాన్యాల్లో పరీక్షలు ప్రారంభం
- డీసీఈబీ నుంచి మండల కేంద్రాలకు చేరుకున్న ప్రశ్నాపత్రాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన విద్యాశాఖ



పభుత్వ పాఠశాల విద్యార్థులు

జిల్లాలో మొత్తం ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలు	2,052
బాలుర సంఖ్య	65,821
బాలికలు సంఖ్య	75191
మొత్తం విద్యార్థుల సంఖ్య	1,41,012

కడప ఎడ్యుకేషన్ : పాఠశాల స్థాయిలో విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను అంచనా వేసేందుకు నిర్వహించనున్న సెల్ఫ్ అసెస్‌మెంట్ పరీక్షలు(ఎస్ఏఎంపీ-1) జిల్లా వ్యాప్తంగా మంగళవారం నుంచి అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించిన ప్రశ్నాపత్రాలను కడపలోని జిల్లా ఉమ్మడి పరీక్షల నిర్వహణ సంస్థ(డీసీఈబీ) నుంచి అన్ని మండల కేంద్రాలలోని ఎమ్మార్సీలకు తరలించారు. ఇంతరకు ఫార్మెటివ్ అసెస్‌మెంట్(ఎఫ్ఏ)గా ఉన్న యూనిట్ టెస్టులను సెల్ఫ్ అసెస్‌మెంట్ మోడల్ పరీక్ష(ఎస్ఏఎంపీ-1)గా పేరు మార్చుతూ ఇటీవల ప్రస్తుత ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. ఏడాదికి మూడు సార్లు నిర్వహించే ఈ పరీక్షలను ఇప్పటిదాకా రోజుకు రెండు పరీక్షల చొప్పున నిర్వహించేవారు. తాజా ఆదేశాల మేరకు ఇక నుంచి ఈ ఎస్ఏఎంపీ-1 పరీక్షలు ప్రతి రోజు ఒక్కో సబ్జెక్టు వంతున ఆరు రోజులపాటు నిర్వహించనున్నారు. ఈ పరీక్షలు ఈ నెల 27 నుంచి సెప్టెంబర్ 4వ తేదీ వరకు జరుగుతాయి.

పరీక్షల షెడ్యూల్ ఇది..

ప్రాథమిక పాఠశాలకు సంబంధించి 3 నుంచి 5 తరగతులకు ఏఎస్ఎస్‌సి పరీక్షలను నిర్వహించనున్నారు.ఈ పరీక్షలను ఉదయం 10.45 నుంచి 11.45 వరకు నిర్వహిస్తారు. ఇందులో 27వ తేదీన ఓఎస్ఎస్‌సి, 28న తెలుగు, 30న ఇంగ్లీష్, 31న గణితం, సెప్టెంబర్ 2న ఎన్విరాన్‌మెంట్ పరీక్షలు ఉంటాయి.

6,7,8 తరగతులకు సంబంధించి..

ప్రాథమికోన్నత పాఠశాలల్లో 6,7,8 తరగతులకు సంబంధించి 27వ తేదీన ఓఎస్ఎస్‌సి-1 మధ్యాహ్నం 1.10 నుంచి 2.10 గంటల వరకు, ఓఎస్ఎస్‌సి-2 పరీక్ష 2.20 నుంచి 3.20 వరకు ఉంటుంది. అలాగే 28న తెలుగు , 30న హిందీ, 31న ఇంగ్లీష్, సెప్టెంబర్ 2న గణితం, 3న జనరల్ సైన్సు, 04న సోషియల్ పరీక్షలు ఉంటాయి. ఈ పరీక్షలు మాత్రం మధ్యాహ్నం 1.30 నుంచి 2.30 వరకు నిర్వహిస్తారు.

9,10 తరగతులకు సంబంధించి..

27వ తేదీన ఏఎస్ఎస్‌సి-1 ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు, ఏఎస్ఎస్‌సి-2 ఉదయం 11.15 నుంచి 12.15 వరకు ఉంటుంది. అలాగే 28న తెలుగు, 30న హిందీ, 31న ఇంగ్లీష్, 02న గణితం, 03న జనరల్ సైన్సు, 04న సోషియల్ పరీక్షలు ఉంటాయి. ఈ పరీక్షలను ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహిస్తారు.

ఈ ఏడాది టోఫెల్ పరీక్ష లేనట్టే..

గత నెల 15న పాఠశాల విద్యాశాఖ విడుదల చేసిన 2024-25 అకడమిక్ క్యాలెండర్‌లో టోఫెల్ తరగతుల నిర్వహణకు ఎలాంటి పీరియడ్స్ కేటాయించలేదు. గత ప్రభుత్వ నిబంధనల మేరకు ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి వచ్చే ఏడాది జులై వరకు టోఫెల్ తరగతులు పీరియడ్స్ నిర్వహించాలి. ఈ మేరకు అకడమిక్ క్యాలెండర్‌లో కేటాయించాలి. అయితే క్యాలెండర్‌లో లేకపోవడంతో ఈ ఏడాది కూటమి ప్రభుత్వం టోఫెల్ పరీక్షకు మంగళం పాడినట్లేనని తెలుస్తోంది.

మార్కుల నమూనాలో మార్పులేదు

యూనిట్ పరీక్షల స్థానంలో ఇంత వరకు నిర్వహించే ఫార్మెటివ్ పరీక్షలు 20 మార్కులకు మాత్రమే ఉండటంతో ఉదయం, మధ్యాహ్నం కలిసి రెండేసి పరీక్షల చొప్పున నిర్వహించి మూడు రోజుల్లో పూర్తి చేసేవారు. తాజా మార్గదర్శకాల ప్రకారం ఒక్కో సబ్జెక్టుకు ఒక్కో రోజు చొప్పున 6 రోజులపాటు పరీక్షలను నిర్వహించనున్నారు. దీని వల్ల ఏడాదిలో సిలబస్ పూర్తి చేసేందుకు సమయం చాలదని, దీని ప్రభావం ఫైనల్ పరీక్షపై చూపుతుందని ఉపాధ్యాయవర్గాలు వాపోతున్నాయి.

ప్రశ్నాపత్రాలు ఎమ్మార్సీ కేంద్రాలకు



ఎస్ఏఎంపీ-1 పరీక్షలకు సంబంధించిన సెల్ఫ్-1 పశ్నాపత్రాలను జిల్లా కేంద్రమైన కడపలోని డీసీఈబీ నుంచి మండల కేంద్రాలలోని ఎమ్మార్సీలకు తరలించాము. అక్కడ సంబంధిత ప్రశ్నాపత్రాలను భద్రపరచాలి. ఆయా పరీక్షల రోజు ఉదయం గంట ముందు సంబంధిత ప్రశ్నాపత్రాన్ని ఆయా హెచ్ఎంల ద్వారా ఎంఈఓలు పాఠశాలలకు పంపాలి.

- విజయ్‌భాస్కర్‌రెడ్డి, సెక్రటరీ, డీసీఈబీ. కడప

పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలి



ఎస్ఏఎంపీ-1 పరీక్షలను ప్రతి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పకడ్బందీగా నిర్వహించాలి. ఏరోజు పరీక్షకు ఆ రోజు ప్రశ్నాపత్రాన్ని మాత్రమే తీసుకెళ్లి పరీక్ష నిర్వహించాలి. పరీక్షల నిర్వహణలో ఎక్కడా ఎలాంటి ఆరోపణలకు తావు లేకుండా హెచ్ఎంలు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి.

- మర్రెడ్డి అనురాధ, జిల్లా విద్యాశాఖ అధికారి

కడపలో ఎల్ఐసీ చెస్, క్యారమ్స్ టోర్నమెంట్

కడప కల్చరల్ : ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన ఎల్ఐసీ సిబ్బందికి జోనల్ స్థాయిలో ఈనెల 28, 29 తేదీల్లో కడపలో చెస్, క్యారమ్స్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు ఎల్ఐసీ కడప డివిజన్ సీనియర్ డివిజనల్ మేనేజర్ జీకేఆర్‌వీ రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ టోర్నమెంటుకు మూడు రాష్ట్రాల పరిధిలోని 17 డివిజన్ల నుంచి మొత్తం 80 మంది క్రీడాకారులు హాజరు కానున్నట్లు తెలిపారు. ఆగస్టు 28 ఉదయం 10 గంటలకు మద్రాస్ రోడ్ లోని హోటల్ శ్రీనివాస రెసిడెన్సీలో ఈ టోర్నమెంట్ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఒక ప్రభుత్వ రంగ సంస్థగా క్రీడలకు సముచిత రీతిలో ఎల్ఐసీ ప్రాధాన్యత ఇస్తోందని ఆయన తెలిపారు. ఈ పోటీల్లో అంతర్జాతీయ ఎల్ఐసీ క్రీడాకారిణి అపూర్వ పాల్గొంటున్నారని తెలిపారు.

29 నుంచి ఆరోగ్యమాత ఉత్సవాలు

కడప కల్చరల్ : కడప వేలాంగణి ఆరోగ్యమాత తిరునాల ఉత్సవాలు ఈనెల 29 నుంచి ఘనంగా ప్రారంభమవుతాయని కడప నగరంలోని ఆరోగ్యమాత క్షేత్రం యువత విభాగం ప్రతినిధులు తెలిపారు. సోమవారం ఆరోగ్యమాత చర్చిలో బృందం సభ్యులు ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం సంస్థ యువత అధ్యక్ష, కార్యదర్శులు ప్రసాద్, మాథ్యూ మాట్లాడుతూ ఉత్సవాలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయని, 29వ తేదీ పతాక ఆవిష్కరణకు కర్నూలు మేత్రాసన పీఠాధిపతులు రెవ డాక్టర్ బిషప్ గోరంట్ల జ్వానేస్ ముఖ్య అతిథులుగా హాజరవుతారని పేర్కొన్నారు.

నెల్లూరు జట్టు విజయం



79 పరుగులు చేసిన నెల్లూరు బ్యాట్స్‌మన్ మాధవ్



71 పరుగులు చేసిన చిత్తూరు బ్యాట్స్‌మన్ నిఖిత్



4 వికెట్లు తీసిన కడప బౌలర్ అస్లాం



71 పరుగులు చేసిన కడప బ్యాట్స్‌మన్ శివకేశవరాయల్

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అండర్-23 అంతర్ జిల్లాల మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్‌లో నెల్లూరు జట్టు విజయం సాధించింది. 51 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో మూడోరోజు సోమవారం బరిలోకి దిగిన నెల్లూరు జట్టు 67.5 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 323 పరుగులు చేసింది. జట్టులోని షేక్ బాజీ 55 పరుగులు, మాధవ్ 79 పరుగులు చేశారు. కర్నూలు బౌలర్లు కనిష్ 3, సాయిసూర్యతేజారెడ్డి 2 వికెట్లు తీశారు. కాగా తొలి ఇన్నింగ్స్‌లో కర్నూలు జట్టు 259 పరుగులు చేయగా, నెల్లూరు జట్టు 174 పరుగులు చేశాడు. కర్నూలు జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 237 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో నెల్లూరు జట్టు 2 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

మ్యాచ్ డ్రా..

చిత్తూరుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం..

కేఎస్ఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో 13 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన చిత్తూరు జట్టు 70 ఓవర్లలో 231 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని నిఖిత్ గౌడ్ 71 పరుగులు, భవానీప్రసాద్ 45 పరుగులు చేశారు. కడప బౌలర్లు అస్లాం 4, విజయభవేంద్రారెడ్డి 3 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన కడప జట్టు చివరిరోజు ఆట ముగిసే సమయానికి 28 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 123 పరుగులు చేసింది. జట్టులోని శివకేశవ రాయల్ 71 పరుగులు చేశాడు. చిత్తూరు బౌలర్ డానియల్ దాస్ 2 వికెట్లు తీశాడు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. కాగా తొలి ఇన్నింగ్స్‌లో చిత్తూరు జట్టు 450 పరుగుల వద్ద డిక్లేర్ చేయగా, కడప జట్టు 245 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో చిత్తూరు జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.

ఉరి వేసుకొని ఆత్మహత్య

ప్రొద్దుటూరు క్రైం : ఎర్రగుంట్ల రోడ్డులోని ఏకోపార్కులో కుళ్లాయప్ప (56) అనే వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. మోడంపల్లెకు చెందిన కుళ్లాయప్ప తాగుడుకు బానిసయ్యాడు. ఈ నెల 21న మద్యం తాగడానికి డబ్బు కావాలని భార్యతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఆ రోజు నుంచి అతను ఇంటికి రాలేదు. ఈ క్రమంలో ఏకోపార్కులో ఒక వ్యక్తి చెట్టుకు ఉరేసుకొని మృతి చెందిన విషయాన్ని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సోమవారం అక్కడికి వెళ్లి పరిశీలించారు. అప్పటికే మృతదేహం పూర్తిగా కుళ్లిపోయింది. మృతదేహంపై ఉన్న దుస్తులు, ఇతర ఆనవాళ్ల ఆధారంగా మృతుడు కుళ్లాయప్పగా పోలీసులు గుర్తించారు.

600 గ్రాముల గంజాయి స్వాధీనం

కడప అర్బన్ : కడప నగరం తాలూకా పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌రెడ్డి, ఎస్ఐలు హుసేన్, ప్రదీప్‌నాయుడు, ఏఎస్ఐ వెంకటేశ్వర్లు, కానిస్టేబుల్ పుల్లయ్య ఆధ్వర్యంలో సోమవారం దాడులు చేపట్టారు. రవీంద్రనగర్ పాత కిరణ్ బార్ వెనుకగల ఖాళీ స్థలంలో గంజాయి విక్రయిస్తున్న వల్లెపు నటేశ్వరరావు, సయ్యద్ ఆసిఫ్, పఠాన్ సుహైల్‌ఖాన్‌లను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 600 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వారిని విచారించగా రామాంజనేయపురానికి చెందిన కొండారెడ్డి నుంచి 1200 గ్రాముల గంజాయి కొనుగోలు చేసినట్లు వారు అంగీకరించారు.

ఘనంగా పల్లా జాతీయ కవితా పురస్కారాల ప్రదానోత్సవం



కంచెరాన భుజంగరావుకు పల్లా పురస్కారం అందిస్తున్న ముఖ్య అతిథులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక తొగటవీర క్షత్రియ కళ్యాణ మండపంలో యువసాహితీ ఆధ్వర్యంలో పల్లా జాతీయ కవితా పురస్కారాల ప్రదానోత్సవం సోమవారం అట్టహాసంగా జరిగింది. ఈ సందర్భంగా 2023 సంవత్సరానికి విజయవాడకు చెందిన అనిల్ డ్యానీ రచించిన 'గాంధారీవాన'.. 2024కు శ్రీకాకుళానికి చెందిన కంచరాన భుజంగరావు రచించిన 'సీటిగింజల పంట'కు ఈ పురస్కారాలను అందజేశారు. ఒక్కొక్కరికి రూ.5116 నగదు బహుమతి, శాలువా, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రముఖ అవధాని నరాల రామారెడ్డి మాట్లాడుతూ పల్లా కృష్ణ తన తండ్రి పల్లా నరసింహులు పేరుతో జాతీయ పురస్కారం ఏర్పాటు చేసి తండ్రి రుణం తీర్చుకుంటున్నారన్నారు. కవి ఏసీ దస్తగిరి మాట్లాడుతూ పల్లా కవిగా, రచయితగా యువసాహితీ వ్యవస్థాపక అధ్యక్షుడిగా, అధ్యాపకుడిగా విభిన్న కోణాల్లో తెలుగుసాహిత్యానికి ఎనలేని సేవ చేస్తున్నారని కొనియాడారు. 'గాంధారి వాన' పుస్తక సమీక్షకుడు పీసీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రచయిత అనిల్ డ్యానీ ప్రజల పక్షాన నిలబడిన కవి అని పేర్కొన్నారు. కవులు ప్రతి పక్షంలో ఉన్నప్పుడే ప్రజల్లో చైతన్యం తీసుకురాగలరని తెలిపారు. 'సీటి గింజల పంట' పుస్తకంపై డాక్టర్ రాధేయ సమీక్ష చేస్తూ రచయిత సమాజంలోని విభిన్న వృత్తులు, శ్రామికుల కష్టాలు, సమస్యల గురించి కవిత్వం ద్వారా చక్కటి సందేశం అందించారన్నారు. పల్లా కృష్ణ మాట్లాడుతూ గత 8 ఏళ్లుగా తన తండ్రి పేరుతో జాతీయ కవితా పురస్కారం అందిస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో వైవీయూ పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎస్.ఈశ్వరరెడ్డి, కల్యాణ మండపం అధ్యక్షుడు బండారు రఘురామయ్య, సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ సీవీ రాజగోపాల్‌రెడ్డి, రచయితలు చదువుల బాబు, కొమ్మిశెట్టి మోహన్, కామనూరు రామ్మోహన్, తోట రామ్మోహన్, గొంటుముక్కల గోవిందు, జింకా సుబ్రహ్మణ్యం, కొత్తపల్లె శ్రీను, కంభం పాములేటి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై వినతుల స్వీకరణ



ప్రజా సమస్యలు వింటున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల : ప్రజా సమస్యలపై కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి సోమవారం వినతిపత్రాలను స్వీకరించారు. భాకరాపురంలోని జగన్ క్యాంపు కార్యాలయంలో ఆయన ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మహిళలు, ప్రజలు సమస్యలు పరిష్కరించాలంటూ వినతుల రూపంలో ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం కార్యాలయంలో ఆయన ముందస్తు జన్మదిన వేడుకలను వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో వైఎస్సార్సీపీ నాయకులు బలరామిరెడ్డి, బయపురెడ్డి, మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేక్‌ను ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. అనంతరం పలుచోట్ల వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డి, కౌన్సిలర్లు కోడిరమణ, కిషోర్, మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మెన్ చిన్నప్ప, పట్టణ కన్వీనర్ హాల్ గంగాధరరెడ్డి, వైఎస్సార్సీపీ నాయకులు రసూల్, నూరుల్లా, రవి, సోఫాల వీరా, జశ్వంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. వైఎస్ అవినాష్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా మంగళవారం బీఎస్ఎన్ఎల్ కార్యాలయం, వైఎస్సార్ క్యాంపు కార్యాలయంలో కేక్ కటింగ్‌తోపాటు మెడికల్ కళాశాలలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తామని పార్టీ నేతలు తెలిపారు.

రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు జిల్లా జట్టు



వెయిట్ లిఫ్టింగ్ ఎంపికల్లో పాల్గొన్న క్రీడాకారులు

కడప స్పోర్ట్స్: ఈ నెల 21వ తేదీన కడప నగరంలోని వైఎస్ఆర్ క్రీడాపాఠశాలలో నిర్వహించిన సీనియర్, జూనియర్, సబ్‌జూనియర్ విభాగం ఎంపికల్లో చక్కటి ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు జిల్లా వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి నారాయణరావు తెలిపారు. ఈనెల 29 నుంచి సెప్టెంబర్ 1వ తేదీ వరకు అనకాపల్లిలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు.

జిల్లా జట్లు..

సబ్‌జూనియర్ బాలురు : ఎస్. అర్షద్, వై.వి.ఎస్.శివపవన్, ఎ.పృథ్వీ, కె. చైతన్య, జె.అశోక్, జి.విష్ణు, డి.భానుతేజ, ఐ.వి.కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎస్. వాజిద్‌బాషా.

సబ్‌జూనియర్ బాలికలు : టి. స్పందన, జి. రాజ్యలక్ష్మి, బి.యామిని, కె.శ్రీవెన్నెల, ఎం.సత్యవతి.

జూనియర్ బాలురు : ఎస్. అర్షద్, వై.వి.ఎన్.శివపవన్, ఎ. పృథ్వి, కె. చైతన్య, జె.అశోక్, జి.విష్ణు, డి.భానుతేజ, ఐ.వి.కిరణ్‌కుమార్, ఎస్.వాజిద్‌బాషా.

జూనియర్ బాలికలు : టి. స్పందన, జి. రాజ్యలక్ష్మి, బి.యామిని, కె.శ్రీవెన్నెల, ఎం. సత్యవతి.

సీనియర్ బాలురు : జి. రవిశంకర్, ఎ. శివ రామకృష్ణయాదవ్.

ప్రియుడితో కలిసి భర్త ప్రాణాలు తీసిన భార్య



గాజుల గంగయ్య (ఫైల్)

సిద్దవటం : వైఎస్సార్ జిల్లాలో దారుణం చోటు చేసుకుంది. ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసిందో భార్య. సిద్దవటం మండలం లింగంపల్లికి చెందిన గాజుల గంగయ్య(45) కడప కార్పొరేషన్‌లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగి. అతనికి జమ్మలమడుగు నియోజకవర్గం కొండాపురానికి చెందిన సంధ్యతో పదేళ్ల కిందట వివాహమైంది. వీరికి ఏడేళ్ల కుమారుడు. మూడేళ్ల కుమార్తె ఉన్నారు. కాగా, సంధ్యకు ఏడాది కిందట పసుపులేటి బలరామ్‌తో పరిచయమైంది. ఈనెల 21వ తేదీన రాత్రి సంధ్య తన ఇంట్లో ప్రియుడితో కలిసి ఉండటం చూసిన గంగయ్య భార్యను మందలించాడు. దీంతో కోపం పెంచుకున్న సంధ్య.. తమకు అడ్డుగా ఉన్న భర్తను చంపేయాలని నిర్ణయించుకుంది. ప్రియుడితో కలిసి అదే రోజు రాత్రి హత్య చేసినట్లు సమాచారం. ఈనెల 24న భర్త గంగయ్య కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు 25న లింగంపల్లికి వెళ్లి సంధ్యను విచారించారు. ఆమె పొంతన లేని సమాధానం చెప్పడంతో అనుమానించారు. మొదట పెన్నానదిలో దూకాడేమోనని చెప్పింది. దీంతో అక్కడ ఆదివారం సాయంత్రం వరకూ గాలింపు చర్యలు చేపట్టారు. అనంతరం పోలీసులు తమదైన శైలిలో సంధ్యను విచారించగా.. గువ్వల చెరువు ఘాట్‌లో పడేశామని చెప్పడంతో గాలించారు. సోమవారం తెల్లవారుజామున గంగయ్య మృతదేహం లభ్యమైంది. మృతదేహానికి శవపరీక్షలు చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను మంగళవారం మీడియాకు వెల్లడిస్తామని ఎస్ఐ చిరంజీవి చెప్పారు.

ప్రభుత్వ స్థలం కబ్జా కోసం టీడీపీ వర్గాల ఘర్షణ



టీడీపీ నాయకుల ఘర్షణకు కారణమైన ప్రభుత్వ స్థలం ఇదే



ఓ టీడీపీ నాయకుడు నిర్మించిన పశువుల షెడ్

సాక్షి టాస్క్‌ఫోర్స్ : కొండాపురం మండలం దత్తాపురం సి బ్లాక్‌లోని బుక్కపట్నం కాలనీలో ప్రభుత్వ స్థలం ఆక్రమించుకునేందుకు టీడీపీ నాయకులు ఒకొరికొకరు పోటీ పడి ఘర్షణకు దిగిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. దీంతో ఇరువర్గాలను తాళ్ల ప్రొద్దుటూరు పోలీస్ స్టేషన్‌కు తీసికొచ్చి పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చినట్లు సమాచారం. వివరాలిలా.. రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావడంతో అధికార పార్టీ నాయకుల కన్ను ప్రభుత్వ స్థలంపై పడింది. ఖాళీ స్థలంలో ఓ టీడీపీ నాయకుడు పశువుల షెడ్ నిర్మించాడు. మరో టీడీపీ నాయకుడు ఆదివారం పశువులకు షెడ్ నిర్మించేందుకు ఖాళీ స్థలంలో కంపచెట్లు తొలగించి చదును చేస్తుండగా ముందు నిర్మించుకున్న టీడీపీ నాయకుడు అభ్యంతరం తెలిపాడు. దీంతో పరస్పరం దాడికి యత్నించారు. గతంలో ఈ స్థలాన్ని గ్రామాభివృద్ధిలో భాగంగా గుడి, బడికి రెవెన్యూ అధికారులు కేటాయించారు. బుక్కపట్నం, దొరువుపల్లి గ్రామాలకు 40 సెంట్లు చొప్పున రెండు పాఠశాలల నిర్మాణానికి అనుమతించారు. మిగతా ఖాళీ స్థలం ఆక్రమించేందుకు ప్రయత్నించగా గొడవకు దారి తీసింది. గతంలో పాఠశాలకు కేటాయించిన సర్వే నంబర్‌పై వన్‌టైం సెటిల్‌మెంట్ తీసుకున్న వారు అదే కాలనీలో ప్లాట్లు కేటాయించండి తమకు ఇచ్చిన పరిహారం ప్రభుత్వానికి తిరిగి ఇస్తామని హైకోర్టును ఆశ్రయించారు. కాని ప్రభుత్వం అలా చెల్లించేందుకు వీలు లేదని హైకోర్టులో ప్రభుత్వం తరపున వాదనలు జరుగుతున్నాయి. మిగతా 1.20 సెంట్ల స్థలంలో ప్లాట్లు కావాలని కోర్టును ఆశ్రయించడంతో అదే సర్వే నంబర్లు కావడంతో పాఠశాల స్థలంతో పాటు నూతన భవనాలు నిర్మించేందుకు వీలు లేకుండా పోయింది. కేసు కోర్టు పరిధిలో ఉన్నా స్థానిక టీడీపీ నాయకులు మాత్రం కబ్జాలకు పాల్పడుతున్నారు. ఈ స్థలం విషయంపై డివిజనల్ రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా రాజకీయ ఒత్తిళ్లతో చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. జిల్లా అధికారులు స్పందించి ప్రభుత్వ స్థలం కబ్జా కాకుండా చూసి పాఠశాలలు, దేవాలయాలు నిర్మించేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.